# నామ సంకీర్తనలో మీ జీవితమును సార్థకము చేసుకోండి!

మనుజులందు నుండు మంచిచెడ్డ నడత
పైకి కానరాదు బైటపడదు
వారివారి నడత వారికే అందించు
మరల జన్మమందు మరువకుండ

జీర్ణకోశాలు దేహాన జేర్చె నెవరు
జనన మరణాలు ఎవరిచే కలుగుచుండు
వారినెరుగంగ నేర్చుటే జ్ఞానమగును
మరువబోకుడిటువంటి మంచిమాట

**దివ్యాత్మ స్వరూపులారా!**

'సర్వమున్ కదలన్ నేర్చెడి కాలమూర్తికి నమస్కారం' అన్నాడు భర్తృహరి. కాలము చాలా అమోఘమైనది. అమోఘమైన కాలమును అరక్షణమైనను వ్యర్థము గావించకూడదు. ఈ పవిత్రమైన కాలమును సర్వులు అనుసరించవలసినదేగానీ కాలము ఎవ్వరిని అనుసరించదు. అట్టి కాలస్వరూపుడే భగవంతుడు. కాలస్వరూపుడైన పరమాత్ముని సత్కర్మలచేత సేవించి అతని అనుగ్రహమును పొంది జీవితమును సార్థకము చేసుకోటం అత్యవసరము.

పవిత్రమైన కీర్తిని ఆర్జించినది, భారతదేశము. ప్రపంచకీర్తిని ఆర్జించినది, భారతదేశము. జగత్ వ్యాప్తిగాంచినది, భారతీయ సంస్కృతి. కాలముచేత మారక, చరిత్రచేత మాయక, ప్రళయముచేత తరుగక, సృష్టిచే పెరుగక ఏ నిత్యసత్యమైతే వున్నదో ఆనిత్య సత్యమునకు ప్రతిరూపమే భారతీయ సంస్కృతి. యజ్ఞయాగాది క్రతువులు ఈ సంస్కృతియొక్క ప్రతిబింబములే!

sri sathyasai vachanamrutam

## తేదీ. 20-10-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము

### మానవుడు ఆచరించే సర్వకర్మల ఫలితమును భగవదర్పితము గావించటమే యజ్ఞము

యజ్ఞమనగా ఏమిటి? పదిమంది ఋత్విక్కులు చేరి సర్వమూ ఆహుతి గావించటము, ఋగ్వేద మంత్రములను ఉచ్చరించటము, యజుర్వేద మంత్రములను స్వాహా గావించటము, సామగానముచేత భగవంతుని ఆహ్వానించటము యివి మాత్రమే యజ్ఞము కాదు. మానవుడు ఆచరించే సమస్త కర్మల ఫలితములను భగవద్పరితము గావించటమే యజ్ఞము. "సర్వకర్మ భగవత్ ప్రీత్యర్థం." మానవుడు చేసే ప్రతి కర్మకూడా భగవత్ కర్మగా విశ్వసించాలి. అది చిన్నదిగాని, పెద్దదిగాని, లౌకికముగాని, ఆముష్మికముగాని, ప్రవృత్తికి సంబంధించినదిగాని, నివృత్తికి సంబంధించినదిగాని మానవుడు ఆచరించే సర్వకర్మలుకూడా భగవత్ ప్రీత్యర్థం గావించేటువంటివే! ప్రతి వ్యక్తికూడా ఆచార్యుడే, ప్రతి వ్యక్తికూడా ఋత్విక్కుడే, ప్రతి వ్యక్తికూడా బ్రహ్మస్వరూపుడే! జగత్తులో కనిపించే సమస్త వస్తువులుకూడా దైవముయొక్క ప్రతిబింబములే! భగవంతుడు సర్వత్ర వ్యాపించినవాడు. సర్వమూ భగవంతునియందే వున్నది. దీనిని పురస్కరించుకొనియే వేదము "అంతర్ బహిశ్చ తత్ సర్వం వ్యాప్య నారాయణ స్థితః" అని తెలియజెప్పింది. లోపలా, వెలుపలా వుండినటువంటివాడు నారాయణుడే!

అయితే, భగవంతుడు ఏ రూపములో వున్నాడు? "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ." భగవంతుడు సత్య, జ్ఞాన, మనంత స్వరూపుడైనవాడు. చూచినది చూచినట్లుగా, చెప్పినది చెప్పినట్లుగా, పలికినది పలికినట్లుగా పలకటము సత్యము కాదు. ఇది ప్రాకృతమైన సత్యము. నిజమైన సత్యము త్రికాలాభాధ్యమైనది. ఏ కాలమునందు మార్పు చెందనిది. ఇట్టి సత్యమును గుర్తించుకొనుటకై సత్యమార్గములో మనము ప్రయాణము చెయ్యాలి. మార్పుచెందని సత్యమును మన హృదయములో చిత్రించుకోవాలి. దాని ప్రతిబింబముచేతనే మనము జగత్తులో ప్రయాణము చేయాలి.

### ఎవరెవరి భావాలను పురస్కరించుకుని భగవంతుడు వారికి ఆ విధముగా సాక్షాత్కరిస్తాడు

జ్ఞానమనగా చైతన్యమేగాని యిది సుజ్ఞాన, విజ్ఞాన, ప్రజ్ఞానములతో కూడినది కాదు. చైతన్యము సర్వత్ర వుంటున్నది. మానవుని కదలించునది, వృక్షములను అదిలించునది, పురుగులను నడిపించునదికూడా చైతన్యము. అట్టి చైతన్య స్వరూపుని గురించి త్యాగరాజు

చెప్పాడు.

**చీమలో బ్రహ్మలో శివకేశవాదులలో**

**ప్రేమమీర వెలసివుండే బిరుదువహించిన రామా నన్ను బ్రోవరా**

అని అన్నాడు. సమస్త ప్రాణులయందు, సమస్త వస్తువులయందు చైతన్య స్వరూపుడై నిరూపిస్తున్నాడు. ఈ చైతన్య తత్త్వమును గుర్తించటమే దైవ దర్శనము. ఇది ఎక్కడ వున్నది? అదియే అనంతము. సర్వవ్యాపకమైనది. ఎవరు ఏ విధముగా తలచినా, ఏ విధముగా భజించినా, ఏ విధముగా ఆరాధించినా, ఆ ఆరాధనా స్వరూపమును, ఆ ప్రేమ స్వరూపమును తాను గుర్తింపజేసి యితరులకు అందిస్తూ వుంటాడు. భగవంతుడా! నా వెంటనే వుండి, జంటనే వుంటుండి, నన్ను కాపాడుతుండమని ప్రార్థించినవానికి జంటనే వుంటాడు, వెంటనే వుంటాడు. అట్టి భక్తుడు ఒక్క భగవంతుని పాద శబ్దముతప్ప అన్యము ఏమాత్రము వినలేడు. 'భగవంతుడా! నా కష్టములు కనిపించటం లేదా, నా బాధలు నీవు చూడటం లేదా,' అని ప్రార్థించినవారికి నేత్రములు మాత్రమే కనిపిస్తాయిట! 'భగవంతుడా! నా ప్రార్థనలు వినబడటం లేదా నా ప్రార్థనలు నీ చెవులను చేరటం లేదా,' అని ప్రార్థించిన భక్తులకు భగవంతుని చెవులు మాత్రమే కనబడుతుంటాయి. 'యద్భావం తద్భవతి.' ఎవరెవరి భావాలను పురస్కరించుకొని భగవంతుడు వారికి ఆ విధముగా సాక్షాత్కరిస్తూ వుంటాడు. అదియే సర్వవ్యాపకమైన అనంతత్వము.

**సమస్త ఆనందములు హృదయానందముతో కూడినవే!**

ఆనందము. ప్రతి మానవుడు ఆనందమును ఆశిస్తున్నాడు. ఆ ఆనందము ఎట్టిది? ఒక్కటే! నిత్యానందం, పరమానందం, యోగానందం, బ్రహ్మానందం, అద్వైతానందం అని ఆనందముయొక్క పేర్లను ఉచ్చరిస్తూ వుంటారేగాని అన్ని ఆనందములుకూడా ఒక్క ఆనందములో లీనమైనవే! సమస్త ఆనందములు హృదయానందముతో కూడినవే. ఆనందమును ఆశించని మానవుడు జగత్తులో కానరాడు. ఏ చిన్న కార్యమునందైనా ఆనందమును అనుభవించాలని ఆశిస్తూ వుంటాడు. ఈ ఆనందము తనయందే వుంటున్నది. సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ అనే తత్త్వముతో బ్రహ్మానంద స్వరూపుడు. బ్రహ్మ అనగా వ్యాపించటమే, విస్తరించటమే! అతను లేని స్థానము లేనప్పుడు అతనిని వెతకటానికి ప్రయాణము

sri sathyasai vachanamrutam

దేనికి? అతడు లేని ప్రదేశము అంటూ ఒకటి లేనప్పుడు కదా అతన్ని ఆశ్రయించటానికి మనము ఒక మార్గములో ప్రయాణించాలి. అందువల్లనే మన హృదయ కవాటములను తెరచి చూచినప్పుడు అందే నిజమైన ఆనంద స్వరూపమును చూడవచ్చు. అందువల్లనే

**విశ్వమంతా ప్రాణ విభుని మందిరమైన వీధి వాకిలి యేదహో**
**విశ్వవిభుడే నీ వెనువెంటనే యుండ పిలుపేది తలుపేది వీధివాకిలి యేది**

అని ఒక కవి చెప్పాడు. విశ్వమంతా ఒక మందిరముగా వున్నప్పుడు దానికి వీధి వాకిలి ఎక్కడ? వీధి అని ఒకటి వుండినప్పుడు కదా వీధివాకిలి వుండుట! అతడు లేని స్థానమే లేదు. అయితే వీధి వాకిలి ఏమిటి?

**వీణ తంత్రులు మీటి ప్రాణతంత్రులు నాటి ఆనంద బాష్పములు**
**ఆత్మార్పణ జేసి కైలాసమే జూడరా ఓజీవ వీధివాకిలి కానరా**

నీ యొక్క ప్రాణము, నీ జీవము, నీ సర్వశక్తులుకూడా భగవదర్పితము చేసినప్పుడు నీవు ఆనందాన్ని అనుభవిస్తావు. అయితే ఈనాడు మనయందు ఇట్టి ఆనందము వున్నదా? అట్టి ఆనంద మొకటి వున్నదని విశ్వసిస్తున్నామా? లేదు. సర్వానందములకు నిలయము హృదయము. ఆ హృదయమునుండి నాదము ప్రారంభము కావాలి. మనము ఏ సాధనలు చేయలేనప్పటికిని, ఏ సాధనలయందు మనకు విశ్వాసము కుదరనప్పటికిని, భగవన్నామమనేది సర్వత్ర వున్నదనే సత్యాన్ని మనము గ్రహించాలి.

'కుశాను భానుహిమకరతే,' అన్నాడు తులసీదాసు. అనగా సూర్యుడు, అగ్ని, చంద్రుడు ఈ జగత్తునకు ప్రత్యక్ష సాక్షులు అని అర్థము. వీటిని ఆశించని మానవుడు లోకములో లేదు కదా! ఆస్తికుడు, నాస్తికుడు, యాస్తికుడు, ఆస్తిక నాస్తికుడు, యోగి, భోగి, విరాగి, బైరాగికూడా వీటిని ఆశించక తప్పదు. అగ్నియే లేకపోతే దేహము చల్లబడిపోతుంది. ఈ దేహమును వేడెక్కించుకొనుటకై ప్రతి మానవుడు ప్రయత్నిస్తూ వుంటాడు. సూర్యతేజస్సే లేకపోతే ఏ విధమైన శక్తిసామర్థ్యములు ఆవిర్భవించవు. మొక్కలుగాని, వ్యక్తులుగాని జీవించటానికి, పోషింపబడటానికి సూర్యకిరణములు అత్యవసరము. చంద్రుడుకూడా అత్యవసరము.

sri sathyasai vahini amrutam

## 'రామ' అన్న పదములో అగ్ని, సూర్యచంద్రాదులు వున్నారు

మానవ జన్మము మనకు ఏ విధముగా ఆవిర్భవించింది? పాపములచేతను, అజ్ఞానముచేతను, తాపములచేతను ప్రాప్తించింది. పాపములను నిర్మూలము గావించుకోటము, అజ్ఞానమును దూరముగావించుకోటము, తాపమునుండి జీవితమును చల్లార్చుకోటము, శాంతి పరచుకొనటము అత్యవసరము. అగ్ని మన పాపములను భస్మము చేస్తుంది. సూర్యుడు మన అజ్ఞానమును నిర్మూలము చేస్తూ వుంటాడు. చంద్రుడు మన హృదయ తాపమును చల్లారుస్తాడు. రామనామములో రా-అ-మ రామ. 'ర' అనగా 'అగ్ని', 'అ' అనగా 'సూర్యుడు', 'మ' అనగా 'చంద్రుడు.' 'రామ' అనే పదములో అగ్ని, సూర్య చంద్రాదులు వున్నారు.

అంతేకాదు, సమస్త శాస్త్రముల సారము భగవన్నామములోనే వున్నది. వేదవాక్యమైన 'తత్త్వమసి' అనేది ఒక నామములోనే యిమిడి వుంది. 'రా' అనగా 'తత్', 'మ' అనగా 'త్వం'; అదే నీవై వున్నావు. ఇది తత్త్వమసి వాక్యముయొక్క అంతరార్థము. ఇక్కడ మరొకటికూడా మనము విచారించాలి. రామనామము నందు సంఖ్యా శాస్త్రమును గుర్తించినప్పుడు మనకు సాక్షీభూతముగా నిలుస్తుంది. నా.అ.మ నామ అవుతుంది. సంఖ్యాశాస్త్రములో 'నా' అనగా ఏమీ లేదు అని అర్థము. 'అ' అనగా రెండు. 'మ' అనగా ఐదు. 0+2+5=7 అవుతుంది. సప్త అంకెలతో కూడినది, నామమనేది మనకు బోధిస్తుంది. సప్తఋషులు, సప్తవర్ణములు, సప్తదినములు ఈ సప్త సంఖ్యయొక్క పవిత్రత తెలుపుతాయి.

## కాలాతీతమైన దైవమును నిరంతరం స్మరిస్తే కాలము మనకు భారము కాదు

ఈనాడు సప్తాహము సమాప్తమయింది. సప్తాహమనగా ఏమిటి? మన యందున్న సప్తధ్వనులను భగవంతునకు అర్పితము గావించటమే! సమాప్తి అనగా బ్రహ్మప్రాప్తి అని అర్థము. బ్రహ్మప్రాప్తము గావించుకొనే నిమిత్తము మనము సప్తాహమనే దానిని ఆచరిస్తున్నాము. ఏడు దినములు ఏడు క్షణములవలె గడచిపోయినవి. దీనికి కారణము ఏమిటి! కాలాతీతమైన భగవచ్చింతనచేతను, కాలాతీతమైన భగవత్కార్యములచేతను మనకాలము గడపటంచేత అదికూడా మనకు కాలాతీతముగానే కనబడుతుంది. కనుక, కాలాతీతమైన దైవమును మనము నిరంతరము స్మరించుకుంటే కాలము మనకు భారము కాదు. అందువలనే కాలమును



sri sathyasai vachanamrutam

జయించిన కాలుని మనము హృదయములో పెట్టుకున్నప్పుడు మనము కూడా కాలస్వరూపులే అయిపోతాము.

**భగవంతుని కళ్యాణ గుణములను చింతిస్తూ గానం చేయడమే గుణసంకీర్తన**

సంకీర్తనము గుణసంకీర్తనము, లీలాసంకీర్తనము, భావసంకీర్తనము, నామసంకీర్తనము అని నాలుగు విధములు. గుణసంకీర్తనమనగా భగవంతుని కల్యాణ గుణములను చింతించుకుంటూ గానము చేయటం, అతన్ని వర్ణించటము.

**నిను కనుగొనగలమా కృష్ణా!**
**అణువుకంటె అతి సూక్ష్మరూపుడవు**
**ఘనముకంటె అతి ఘననీయుడవు**
**ఎనుబది నాలుగు లక్షల జీవముల**
**అనయంబున నెడ బాయకుందువట**
**అఖండ రూపుడవై వెలయుదువట**
**నిను కనుకొనగలమా!**

ఇట్టివి గుణ సంకీర్తనములు. ఇట్టి గుణములను మాత్రమే వర్ణించుకుంటూపోతే ఒక్కొక్క పర్యాయము ఈ గుణములను గుర్తించుకోలేక కొంత సందేహము కలుగవచ్చు. 'అణోరణీయాన్, మహతోమహీయాన్' అని చెప్పారు కదా! అన్నిచోట్లా భగవంతుడు వున్నాడని. ఎక్కడా కనిపించటం లేదే! భూప్రదక్షిణ చేయటానికి చాలామంది వెళ్లుతుంటారు. ఎక్కడా భగవంతుడు కనిపించటం లేదే అని సందేహము వచ్చును. కానీ వారు చూచే యంత్రములు వేరు. భగవంతుని కనిపింపచేసే మంత్రము వేరు. నిజముగా భగవంతుడు మంత్ర స్వరూపుడుగాని, యంత్ర స్వరూపుడు కాదు. కనుక ఈ గుణములను వర్ణించేటప్పుడు మానవునకు కొన్ని అనుమానములు కలుగవచ్చు.

**భగవంతుని లీలలను వర్ణిస్తూ గానం చేయడం లీలా సంకీర్తనము**

రెండవది లీలా సంకీర్తనము. ఇతను చేసిన లీలలు, చర్యలు నడతలు ఒకరిని ఏడిపించటము, ఒకరిని నవ్వించటము, ఒకరికి కన్నీరు తెప్పించటము, ఒకరికి ఆనంద

sri sathyasai vachanamrutam

బాష్పములు తెప్పించటము.

**కన్నీరు తెప్పించు కన్నీరు తప్పించు**
**చిన్మయ మూర్తి ఓ చిన్ని రామ**
**యోగిని భోగి చేయు భోగిని యోగిగ చేయు**
**భాగవతాగ్నిని బాలరామ**
**పిచ్చులు పట్టించు పిచ్చిని పోగొట్టు**
**సచ్చిదానందుడు సాయిరామ**

భగవంతునిపై పిచ్చి పట్టిస్తాడు. జగత్తుపైనుండు పిచ్చి దూరము చేస్తాడు. ఇలాంటి లీలలను గూర్చి వర్ణించటమే లీలానామ స్తోత్ర మన్నారు. ఇందులోకూడా కొన్ని సందేహములు కలుగవచ్చును.

**రాధవలె నిరంతరము భగవన్నామమును ధారగా చింతించడమే భావ సంకీర్తన**

ఇంక భావ సంకీర్తనము. ఈ భావము లెట్టివి? శాంతభావము, ఇది భీష్ముడు అనుసరించినది. సఖ్యభావము, యిది అర్జునుడు అనుసరించినది. దాస్యభావము, హనుమంతుడు అనుసరించినది. వాత్సల్య భావము, యశోద అనుభవించినది. అనురాగ భావము, గోపికలు అనుభవించినటువంటిది. రాధ అనుభవించినది, అన్నింటికంటె విశిష్టమైనది. ఈ రాధయొక్క భక్తికి మూలకారణమేమిటి? నిరంతరము భగవంతుని నామమును ధారగా చింతించుటచేత రాధ అయింది. రాధ అనగా స్త్రీ కాదు. ఎవ్వరు ఈ విధముగా చింతించినా వారందరూ రాధలే! ఇదే భావ సంకీర్తన అన్నారు.

**నామ సంకీర్తనలో ఎట్టి వికారములకు, ఉద్రేకములకు అవకాశము లేదు**

గుణ సంకీర్తనయందు, లీలా సంకీర్తనయందు కొన్ని లోపములు జరుగవచ్చును. కొన్ని ఉద్రేకములు కలుగవచ్చు. కొన్ని వుల్లాసములు ఏర్పడవచ్చును. వికారములుకూడా కలుగవచ్చును. కలియుగములో ప్రధానమైనది నామసంకీర్తన అన్నారు. నామ సంకీర్తనలో ఎట్టి వికారములుగాని, ఉద్రేకములకు గాని అవకాశము లేదు. చేయుచూ చేయుచూ వుల్లాసము అధికమై పోతుంది. ఈ వుల్లాసములో దూషణ భూషణములు సమత్వముగా మారిపోతుంది.

sri sathyasai vacahamrutam

**హెచ్చుగ సంపదలొచ్చినగాని, ఏనుగు గుఱ్ఱము లెక్కినగాని**
**పిచ్చోడని పేరొచ్చినగాని ప్రీతితొ ప్రజలు మెచ్చినగాని**
**నామము మరువకురా నీవు దైవము మరువకురా.**

**యోగాభ్యాసము చేసినగాని భాగవతాదులు చూచినగాని**
**బాగుగ గెడ్డము పెంచినగాని పట్టెనామములు పెట్టినగాని**
**దేవుని మరువకురా నీవు నామము విడువకురా.**

**కనులు మూసి జపమాచరించినా మొక్కుచు బాగా నిలిచియుండిన**
**మ్రొక్కి మ్రొక్కి ఎంత ఏడ్చినగాని మొరలిడినను నీకు కరుగదు మనసు**
**నామము మరువకురా నీవు దైవము మరువకురా**

భగవంతుని నామము సర్వుల హృదయములలో హత్తుకొనిపోయేరీతిగా వుంటుండాలి. ఈ నామము హృదయములో హత్తుకోవాలంటే హృదయము మెత్తబడాలి. హృదయము మెత్తబడాలంటే ప్రేమతో దానిని స్మరించాలి. ప్రేమగల హృదయమే మృదు మధురమైన హృదయము.

**'సమ్యక్ కీర్తనం యితి సంక్తీరనమ్'**

సంకీర్తన, కీర్తన అన్నారు. కీర్తనమునకు సంకీర్తనమునకు వ్యత్యాసమేమిటి? కీర్తన ఒక్క వ్యక్తికి మాత్రమే ఆనందము నిస్తుంది. ఎవరు కీర్తన చేయుచున్నారో వారికి మాత్రమే ఆనందాన్ని అందిస్తుంది. 'సమ్యక్ కీర్తనమ్ యితి సంకీర్తనమ్.' సర్వులూ కలిపి పాడటము యిది సంకీర్తనము. ఇది అందరినీ ఆనందింప చేస్తుంది. కనుక, కీర్తన కంటె సంకీర్తన చాలా వుత్తమమైనది. ఏనాడూ నోరెత్తి పాడనివాడు అందరూ పాడుతుంటే తానుకూడా నోరెత్తి పాడుతుంటాడు. ఈ సంకీర్తనయందు మనస్సు సమత్వాన్ని పొందుతుంది. నేను ఒకసారి ధార్‌వార్‌లోని కర్ణాటకా యూనివర్సిటీకి వెళ్లాను. ఈ కర్ణాటకా యూనివర్సిటీలో అందరూ వీరశైవులే! శివనామము తప్ప అన్యనామములు ఏమాత్రము వారి కర్ణములలో ప్రవేశించరాదు. అందరూ నా ప్రసంగముకోసము వచ్చారు. మొట్టమొదట నేను కన్నడములో ఉపన్యాసము ప్రారంభించాను వారి కన్నడంకంటె నా కన్నడం చాలా మృదు మధురంగా వుంటున్నది. ఆ

sri sathyasai vachanamrutam

భాషాభిమానముతో వారు చాలా ఆనందించారు. ఉపన్యాసమైన వెంటనే నామసంకీర్తన ప్రారంభించటము నాకు అలవాటు. వారిని చూచాను. వారు ఏ స్థితిలో వున్నారని గమనించటానికి నేను సంకల్పించుకున్నాను. వైష్ణవ నామము వారికి వేలమైళ్ల దూరంలో వుండాలి. నారాయణ అంటే చెవులు మూసుకుంటారు. కృష్ణా అంటే వారు తలలు తిప్పుతారు. అలాంటి సమయములో నేను 'గోవిందకృష్ణ జై గోపాలకృష్ణ జై' అని ప్రారంభించాను. 'గోవింద కృష్ణ జై' అని వారుకూడా నన్ను అనుసరించారు. వారిలో ఒక శైవగురువు వున్నాడు. అతను కూడా 'గోవిందకృష్ణ జై గోపాలకృష్ణ జై' అని అనటం ప్రారంభించాడు. కట్టకడపటికి ఉపన్యాసము అయిపోయిన తరువాత వైస్‌ఛాన్స్‌లర్ అడికే పరుగెత్తుకుంటూ నా దగ్గరకు వచ్చాడు. "సాయిబాబా మిరకిల్సు అంటే ఏమో అనుకున్నాము. తమలైఫ్‌లో ఎన్నడూ కృష్ణనామము జపించనివారిచే సాయిబాబా కృష్ణనామము జపింపచేశారు! అదే పెద్ద మిరకిల్," అన్నాడు.

దీని అంతరార్థమేమనగా ఎవరైనా నామసంకీర్తనములో తమను తాము మరచిపోవచ్చును. మైమరపింపజేసి ఆనందమునకు అవకాశము కల్పించునది ఒక్క నామము మాత్రమే! కనుక, నామముచేత మనము సంసారమును దాటుటకు కొంత కృషి చేయాలి.

**సర్వులు భగవంతుని బిడ్డలేనన్న విషయం గుర్తించుకోండి**

దివ్యాత్మస్వరూపులారా! ముఖ్యముగా మీరందరూ యిక్కడికి విచ్చేసినందుకు గుర్తించవలసినది, తెలుసుకోవలసినది ఒక్కటే! జాతి, మత, కుల భేదములను విస్మరించి సర్వులు భగవంతుని బిడ్డలే అన్న విషయాన్ని తెలుసుకోవాలి.

**మన జాతి ఒక్కటే అదే మానవ జాతి**
**మన ఆరాధన ఒక్కటే దైవము**
**మన కులము ఒక్కటే అదే ప్రేమకులము**
**మన భాష ఒక్కటే అదే హృదయ భాష**

ఇట్టి సమత్వాన్ని మీరు గుర్తించి, భేద భావములను దూరమునెట్టి, ప్రేమభావము హృదయమున చేర్చుకొని దివ్యమైన నామసంకీర్తనలో మీ జీవితమును సార్థకము గావించుకోండి.

ఆ నామమే సర్వసౌఖ్యములను అందిస్తుంది. జీవితమును సుఖశాంతులతో



sri sathyasai vechanamrutam

జీవింపచేస్తుంది. దీనివలన రాగద్వేషములు దూరమవుతాయి. మానవునకు ప్రేమ ఒక్కటే ప్రధానమైన లక్ష్యము. కనుక, ఈ రాగద్వేషములను దూరము చేసుకొనే నిమిత్తమై ప్రేమతత్వాన్ని పెంచుకోండి. దానివలన మీకు ఏమాత్రము నష్టము వుండదు. మీ పాపములను పరిహారము గావిస్తుంది.

**(తేదీ. 20-10-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam